వెళ్ళి అలాగే నిలబడ్డాడు. పొరపాటుగా జడ్జి ఆ దొంగచేత కూడా పోలీస్ పుద్యోగంలో చేరేప్పుడు చేసే ప్రమాణాన్ని చేయించాడు.

* ఓ జడ్జి ఏక్సిడెంట్‌లో ఇన్‌వాల్వ్ అయిన ఓ కారు డ్రయివర్ తప్పేం లేదని శిక్ష వేయకుండా వదిలేశాడు. అయిదు నిమిషాల తర్వాత జడ్జి తన కారులో ఇంటికి వెళ్తుంటే మరో కారు వచ్చి జడ్జి కారుని గుద్దింది. నిరపరాధిగా వదిలేసిన డ్రైవర్‌దే ఆ కారు.

# హేపీ బర్త్ డే

సొసైటీలో అంతా కలిసి చేసుకునే పండుగలన్నీ ఒక ఎత్తు. ఎవరికి వారు వ్యక్తిగతంగా చేసుకునే పండుగ ఒక ఎత్తు. అదే పుట్టిన రోజు.

పుట్టిన రోజుని పండుగగా చేసుకునే సాంప్రదాయం మనకి ఆంగ్లేయుల నుంచి వచ్చిన ఆచారం. పెద్దవాళ్ళయ్యేకొద్దీ ఈ సరదా పోతుంది కాని చిన్నపిల్లలు దీన్ని సరదాగా చేసుకుంటుంటారు. 'నా బర్త్ డేకి రండి' అని నలభై ఏళ్ళ వాళ్ళు పిలుస్తే ఎబ్బెట్టుగా అనిపిస్తుంది.

ఇండియాలో ప్రతి మనిషికి బర్త్‌డేలు రెండుంటాయి. ఒకటి కేలండర్ తేదీ ప్రకారం చేసుకునేది. ఇంకోటి తిథిని బట్టి చేసుకునేది. మొదటి దానికే బర్త్‌డే సెలబ్రేషన్‌కి ప్రాధాన్యత నిస్తున్నారు.

ముఖ్యంగా ఇంగ్లీషు మీడియంలో చదివే పిల్లలు, తమ బర్త్‌డే రోజు స్కూల్ యూనిఫారం బదులు మామూలు బట్టలు వేసుకెళ్ళచ్చన్న నియమం చాలా స్కూళ్ళలో వుంది. పెన్సిల్స్, చాక్లెట్స్, బొమ్మలు లాంటివి కొనిస్తే స్కూల్లో క్లాస్‌మేట్స్ అందరికీ వాటిని పంచడం కూడా నేటి నాగరికతగా మారింది. అలాగే కేక్ మీద కొవ్వొత్తు లుంచి, వాటిని పూది కట్ చేయడం, ఇంట్లో గోడలకి రంగు కాగితాలు, బూరలు కట్టడం లాంటివన్నీ కూడా యూరప్ నుంచి ఇంపోర్ట్ అయిన

ఆచారంగా మారింది.

గతంలో పుట్టినరోజు నాడు వుదయం తలంటి పోసుకుని గుడి కెళ్ళి అర్చన చేయించేవారు. నేడు సినిమాకి వెళ్తున్నారు.

సినిమా వారపత్రికల్లో చదువుతుంటాం, సెట్‌లో ఓ నటి బర్త్‌డే సెలబ్రేట్ చేశారని. ఆ వార్తల్లో పేర్ల మార్పు తప్ప కంటెంట్ ఒకటే. ఆ నటి సెట్‌కి వచ్చి, తన పేరుగల బర్త్‌డే కేక్‌ని చూసి ఆశ్చర్య పోతుంది. నిర్మాతకి అప్పుడే ఆ విషయం తెలియడంతో (ఎలా?) చకచక ఏర్పాట్లు చేశాడు. షూటింగ్ ఆపి ఆమెచే ఆ కేక్ కట్ చేయిస్తారు. నటి నోట్లో కేక్ ముక్కని వుంచుతున్న దర్శక, నిర్మాతల ఫోటోలు వేస్తారు. "నాకిలాంటివి నచ్చవని చెప్పకపోయినా ఎలాగో నిర్మాతగారు తెలుసుకుని నా పుట్టినరోజు పండగని ఘనంగా సెలబ్రేట్ చేసినందుకు వారికి నా కృతజ్ఞతలు' అంటుందా నటి. నటుడయితే అతని బరువుకి రెట్టింపు బరువుగల పూలమాల వేస్తారు, (ఈ దండ బరువు నటుడిని బట్టి పెరగడమో, తరగడమో జరుగుతూంటుంది).

ఆఫీసుల్లో అయితే కలిసి మందుకొట్టే అలవాటున్న వారు ఎంచక్కా ఆ సాయంత్రం ఓ బార్‌కి వెళ్తారు.ఎటొచ్చీ పుట్టినరోజు చేసుకోనిది బామ్మలు, తాతయ్యలు, అమ్మమ్మలే.

తెలుగు సినిమాలు పుట్టినరోజు పండగల్ని పాపులర్ చేశాయనే చెప్పాలి. 'హేపీ బర్త్‌డే టూయూ' అని పాట పాడితే కేక్ కట్ చేశాక హీరోయిన్ లేదా హీరోనో పుట్టినరోజు మీద ఓ పాట పాడతారు. ఒక సీజన్‌లో చెల్లెలు పుట్టిన రోజున చిన్నప్పట్నుంచి ఆమెని పెంచి పెద్ద చేసిన అన్నయ్య లేదా అతని పుట్టినరోజున తనని ఎలా పెంచాడో చెప్తూ చెల్లెలు పుట్టినరోజు పాటలు పాడేవారు (పుట్టిన రోజు పండగే అందరికీ, దాని విలువ తెలిసేది ఎందరికి లాంటివి).

ఒకోసారి ఈ పాట సిట్యుయేషన్ సాంగ్ అవుతుంది. అంటే ఇద్దరు హీరోయిన్లలో ఓ అమ్మాయి హీరో ప్రేమ గురించి తన త్యాగం గురించి పాడేసేస్తుంది. హిందీ సినిమాల నుంచి తెలుగు సినిమాలకి దిగుమతి అయ్యాయి ఈ పాటలు,

ఓ మగాడు తన పుట్టిన రోజుని 'అఫ్' (శెలవ) పెట్టి ఎంజాయ్ చేస్తే, ఓ అమ్మాయి తన పుట్టినరోజున తన వయసులోంచి ఓ సంవత్సరం 'అఫ్' చేసి (తగ్గించి) ఎంజాయ్ చేస్తుందిట.

'బర్త్ సర్టిఫికేట్స్' ప్రాముఖ్యత పెరిగాక పుట్టినరోజు ఏదో ఇప్పుడు ఖచ్చితంగా తెలుస్తోంది కాని ఓ జనరేషన్ వెనక్కి వెళ్ళితే చాలా మందికి తమ పుట్టినరోజు ఎన్నడో తెలీదు. గోదావరి పుష్కరాలకి మా అమ్మ నన్ను కడుపుతో వుందని చెప్తూండేది అనో, మా పిన్ని కూతురికి నాకు నాలుగు నెలలు తేడా అనో గుర్తుంచుకునేవారు తప్ప ఖచ్చితంగా ఫలానా రోజు ఫలానా తారీఖు అని చెప్పగలిగేవారు కాదు పూర్వీకులు. అంచేత మా నాన్నగారు తన ఎనభై నాలుగవ ఏట పోయారా లేక డభై తొమ్మిదో ఏట పోయారా అంటే చెప్పలేను.

వాళ్ళ చిన్నప్పుడు పుట్టినరోజులకి పేరంటం చేసి మంగళహారతి పట్టి పాటలు పాడేవారట. పుట్టినరోజు పండగ కొందరికి సరదా అయితే కొందరికి దసరా పండగవుతుంది.

ఏ హోటల్లోనో పార్టీ కోసం కొంత ఖర్చుచేసి బిల్లు తీసుకుంటారు.

తన పుట్టినరోజుకి నగదు బహుమతిగా తన బంధుమిత్రులు డబ్బిచ్చారని మర్నాడు బ్లాక్‌మనీని అకౌంట్‌లోవేసి దాన్ని ఏటా వైట్ చేసుకుంటారు. ఇలా వచ్చిన నగదు బహుమతి మీద ఇన్‌కంటాక్స్ వుండదుగా మరి. కాబట్టి డబ్బున్న ప్రతివారు విధిగా చేసుకునే పండగ ఇది.

వీళ్ళు కొంతడాకా నయం. తమ నల్ల ధనాన్ని తెల్ల ధనంగా చేసుకుంటారు. ప్రభుత్వోద్యోగులు కొందరు పుట్టినరోజు జరుపుకోవడానికి కారణం మామూళ్ళ కోసం.

కంట్రాక్టర్లని, తమతో రెగ్యులర్‌గా పనివుండే వాళ్ళని ఈ పార్టీలకి ఆహ్వానిస్తారు. రెండు బిస్కెట్లు తిని, ఓ కప్పు టీ తాగి బరువైన కవర్లు ఇచ్చి వెళ్తారా అతిథులు.

మరో రకం వుద్యోగులు తను కింద వుద్యోగస్తుల నుండి 'మామూళ్ళు' స్వీకరణకి ఇలాంటి పుట్టిన రోజులు జరుపుకుంటుంటారు. కొన్ని సీట్లలోనే వుండగోరే కొందరు పుట్టినరోజు పండగకివెళ్ళి 'దక్షిణ'

సమర్పించి ఆ సీట్లని కొనుక్కుని 'సద్యోగం' ద్వారా సంపాదిస్తుంటారు.

బహుసుతుల కోసం ఓ అధికారి తనకి సంవత్సరంలో మూడుసార్లు బదిలీ అయితే మూడుచోట్ల పుట్టినరోజు జరుపుకున్న అంశం మీద ఓ కథ రాసాను.

బర్త్ డేకి గ్రీటింగ్ టెలిగ్రాం లేదా కార్డ్ పంపించడం కూడా మనకి అంగ్రేజీ దేశం నుంచి దిగుమతయిన ఆచారం. కేవలం బర్త్‌డే కార్డ్స్ అమ్మడానికే పుస్తకాల దుకాణాల్లో కొన్ని రేక్స్ ప్రత్యేకంగా వుంటాయి. వీటిలో ప్లెయిన్‌గా మెసేజ్ చెప్పేవి కొన్నయితే, మరి కొన్ని హాస్యోక్తులతో వుంటాయి.

నాకొచ్చిన ఓ బర్త్‌డే కార్డ్‌లో ఇలా రాసి వుంది.

డియర్ మల్లాదిగారు. బాంబే

వంద రూపాయల నోటుని మీకు బర్త్‌డే గిఫ్ట్‌గా పంపాలను కొన్నాను. కాని ఈ కవరు అతికించాక ఆ సంగతి గుర్తొచ్చింది కాబట్టి పంపలేక పోతున్నందుకు ఏం అనుకోవద్దు. మీ

ఎల్. రమేష్.

శ్రీరామ నవమి రామచంద్రమూర్తి పుట్టినరోజు పండగ. అలాగే కృష్ణాష్టమి కూడా శ్రీకృష్ణుకి పుట్టినరోజు పండగే. కాని అమ్మవార్లు, హనుమంతులవారు లాంటి దేముళ్ళ పుట్టినరోజులు పండగలు కాలేక పోయాయి. ఇదే ప్రిన్స్‌పల్ మీద నెహ్రూ పుట్టినరోజున బాలలకి సెలవు, గాంధీ పుట్టిన రోజు ఇండియా కంతటికి సెలవు. కాని బాబూ రాజేంద్ర ప్రసాద్ లేదా ఫక్రుద్దీన్ అహమ్మద్ పుట్టినరోజులు మరుగున పడ్డాయి.

ఓ మనిషి ఎప్పుడు ముసలి వాడయినట్లు? బర్త్‌డే కేక్ ఖరీదు కన్నా దాని మీద వెలిగించడానికి వుంచిన కొవ్వొత్తుల ఖరీదు ఎక్కువయినప్పుడు. (పిల్లల కేక్స్ మీద ఒకటి నుంచి తొమ్మిది దాకా నంబర్ల ఆకారంలో చేసిన బర్త్‌డే కాండిల్స్ లభిస్తాయి. కాని పెద్దవాళ్ళకా సౌకర్యం లేదు మరి).

టాల్‌స్టాయ్ చెప్పిన కొటేషన్ ఒకటుంది. 'నీవు ఈ ప్రపంచంలో ఏదీ లేకుండా పుట్టావు. ఆ తర్వాత చచ్చేదాకా నీకు జరిగేదంతా లాభమ్మే'

అలాగే ఓ పుట్టినరోజు నించి ఇంకో పుట్టినరోజు దాకా జరిగిందంతా లాభం కిందే లెక్క. మీరే చెప్పండి. 365 రోజులు బ్రతకడం లాభం కాక నష్టమా?

# కమ్మని కల

మే ఇరవై అయిదున నేను మా ఇంటికి ఎక్స్‌టెన్షన్‌గా ఓ గది కట్టించాలని వాటికి సంబంధించిన పేపర్లతో మునిసిపల్ కార్పొరేషన్‌కి వెళ్ళాను. అక్కడ లంచం ముట్టనిదే ఏ పనీ జరగదని ఎల్. కె. జీ. కుర్రాడికి కూడా తెలిసిందే.

ఓ ఆఫీసర్‌కి ఆ పేపర్లు సబ్‌మిట్ చేశాను. ఆయన దాన్ని జాగ్రత్తగా పరిశీలించి, అంతా నియమాల ప్రకారమే వుందని రూఢి చేసుకున్నాక సేంక్షన్ సంతకం చేసేసాడు. లంచం గురించి మాట్లాడకుండా ఆయనలా సంతకం చేయడం నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆయనంతట ఆయన అడిగితే బావుండదని, భేషజానికి పోయాడనుకుని చెప్పాను మెల్లిగా.

"వెయ్యి రూపాయలు తెచ్చాను సార్."

"దేనికి?" అడిగాడాయన.

"మీకివ్వాలని."

"నాకెందుకివ్వాలి?" నావంక ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు.

అది నాకు ప్రపంచంలో ఎనిమిదో వింతగా తోచడంతో చెప్పాను నీళ్ళు నములకుండా.

"సేంక్షన్‌కి పోయినసారి వెయ్యి తీసుకున్నారు కదా? అందుకని".

"ఆ రోజులు పోయాయి" చెప్పాడాయన నావంక ఎగాదిగా చూసి.

"వెయ్యి చాలదా?" అడిగాను.

"మీరు లంచం గురించి మాట్లాడేటట్లయితే బయటకి నడవండి.